క్లుప్తంగా

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.జాహ్నవి ఆదివారం తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

ఎలక్ట్రీషియన్ల సంఘ అధ్యక్షుడిగా 'పంచుమర్తి'

కంచికచర్ల : ప్రైవేటు ఎలక్ట్రీషియన్ యూనియన్ అధ్యక్షుడిగా వీరులపాడు మండలం గోకరాజుపల్లి గ్రామానికి చెందిన పంచుమర్తి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కంచికచర్లలో ఆదివారం అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటేశ్వరరావును అందరూ అభినందించారు.

టెన్త్ మోడల్ పేపర్లు ఆవిష్కరణ



కంచికచర్ల: మండలంలోని ఏడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉన్న 476మందికి పంపిణీ చేసేందుకు రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) ఆధ్వర్యంలో రూపొందించిన మోడల్ పేపర్ల మెటీరియల్‌ను ఆసంఘ నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్టీయూ రాష్ట్ర ప్రచురణల కమిటీ కోకన్వీనర్ కోదాటి వెంకటేశ్వరరావు, మండల శాఖ ఉపాధ్యక్ష్యులు మల్లారపు రాధాకృష్ణ ఆర్థికసహకారంతో మోడల్ పేపర్లను ముద్రించినట్లు తెలిపారు. ఈ మోడల్ పేపర్లను త్వరలోనే టెన్త్ విద్యార్థులకు పంపిణీ చేస్తామని వివరించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్టీయూ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నంద్రు సురేష్‌బాబు, బళ్లా రవికుమార్, నాయకులు శేషం గోపాలరావు, షేక్ ఇస్మాయేల్, విక్టర్, మందా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీల్లో డీజిల్ చోరీ



వత్సవాయి: ఆగిఉన్న లారీల్లో డీజిల్ చోరీచేసిన ఘటన శనివారం రాత్రి వత్సవాయి మండలంలో చోటుచేసుకుంది. ఒకే ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీలు ఒకటి మక్కపేట అయ్యప్ప స్వామి ఆలయం వద్ద, మరొకటి వత్సవాయిలోని వేబ్రిడ్జి వద్ద నిలిపి డ్రైవర్లు నిద్రపోయారు. ఆదివారం ఉదయం చూడగా ఒక్కో లారీలో 350లీటర్లు చొప్పున మొత్తం 700లీటర్లు డీజిల్ చోరీకి గురైనట్లు డ్రైవర్లు గుర్తించారు. దీంతో లారీడ్రైవర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వత్సవాయి పోలీసులు తెలిపారు.

సమస్యలపై ప్రజల పక్షాన పోరాటం

సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ



తిరువూరు: తమ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే పోరాడుతుందని, పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ అన్నారు. జనవరి 3, 4, 5 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు తిరువూరులో జరుగనున్న సందర్భంగా ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కిడ్నీ రోగుల సమస్యలపై నిరంతర పోరాటం చేసి ఐదు డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటుకు కృషిచేశామన్నారు. ఇటీవల సంభవించిన వరదల్లో తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలకు తమ పార్టీ ఎనలేని సేవ చేసిందని చెప్పారు. కోవిడ్ సమయంలో తమ పార్టీ కార్యకర్తలు రోగులకు అందించిన సేవలను ప్రజలు గుర్తించారన్నారు. 3వ తేదీన బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. నాయకులు ఎం. నాగేంద్రప్రసాద్, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, కల్యాణ్, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా అర్థమెటిక్ జీనియస్ పోటీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సిప్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సిప్ అబాకస్ అర్థమెటిక్ జీనియస్ పోటీలు ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. నగరంలోని అకాడమీ ప్రాంగణంలో జరిగిన పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 30 పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను సిప్ అకాడమీ స్టేట్ హెడ్ మాకినేని గోపాలకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జ్ఞాపకశక్తిని పెంపొందించడానికి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు గణితంపై ఆసక్తి, జిజ్ఞాస పెంపే లక్ష్యంగా సిప్ అకాడమీ అబాకస్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

లాభసాటిగా పూల సాగు

- తక్కువ ఖర్చుతో అధికలాభాలు
- సంప్రదాయపంటలకు భిన్నంగా సాగు
- రైతులకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్న జక్కులూరి సాంబయ్య



సాగుచేస్తున్న చామంతి తోటలో రైతు సాంబయ్య

కె.పొన్నవరం(పెనుగంచిప్రోలు): ఇటీవలి వరకు వరి, మిర్చి, పత్తి పంటలు సాగు చేసిన పలువురు రైతులు ఆయా పంటలసాగుకు స్వస్తి పలుకుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే కూరగాయలు, పూల తోటల సాగుపై అసక్తి కనపరుస్తున్నారు. మండలంలోని కె.పొన్నవరం గ్రామానికి చెందిన రైతు జక్కులూరి సాంబయ్య తనకున్న ఎకరం పొలంలో ఈప్రాంతంలో ఎవరూ సాగుచేయని విధంగా చామంతి, నందివర్ధనం పూలసాగు చేపట్టి అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాడు. సంప్రదాయ పంటలసాగుకు భిన్నంగా తక్కువ పెట్టుబడితో అధికలాభాలు వచ్చేందుకు అవకాశాలు మెండుగా ఉన్న పూల సాగు చేపట్టి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాడు.

పూలకు మంచి గిరాకీ...

ప్రస్తుతం పూలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. సాంబయ్య రూ.30వేలు ఖర్చుచేసి బెంగుళూరు నుంచి 20వేల చామంతి మొక్కలు తెప్పించి అర ఎకరం పొలంలో సాగుచేపట్టాడు. ఇతర ఖర్చులన్నీ కలిపి పెట్టుబడి వ్యయం రూ.50వేల వరకు అవుతోంది. మొక్క వేసిన మూడు నెలల తరువాత ప్రస్తుతం పూలు వస్తున్నాయి. రకరకాల రంగుల్లో ఉన్న చామంతి పూలు కేజీ ప్రస్తుతం మార్కెట్‌లో రూ.100 నుంచి రూ.150 వరకు ధర పలుకుతోంది. రోజుకు 7 నుంచి 8 కిలోలు పూలు కోస్తున్నారు. చామంతి సాగుతో రూ.1లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతు సాంబయ్య చెబుతున్నాడు.



కె.పొన్నవరంలో పండిస్తున్న నందివర్ధన పూలు

నిరంతర ఆదాయం...

అదేవిధంగా నిరంతరం ఆదాయం వచ్చేలా రైతు సాంబయ్య నందివర్ధనం సాగు చేపట్టాడు. మొక్కలు నాటిన 8 నెలల నుంచి కొన్నేళ్లపాటు ఈ నందివర్ధనం నుంచి ఆదాయం వస్తుండటంతో ఒక్కో నందివర్ధనం ఒక్కో మొక్కకు రూ.65 వెచ్చించి 300 మొక్కలను బెంగుళూరు నుంచి తెప్పించి మరో 20సెంట్ల స్థలంలో సాగు చేస్తున్నారు. ఈ పంటసాగుకు రూ.20వేల వరకు ఖర్చవ్వగా, ప్రస్తుతం రోజుకు నాలుగు నుంచి ఐదు కేజీల నందివర్ధనం కోస్తున్నారు. ప్రస్తుతం నందిగామ మార్కెట్‌లో నందివర్ధనం పూలు కేజీ రూ.200 పలుకుతుండగా, విజయవాడ మార్కెట్‌కు తరలిస్తే కేజీకి రూ.500 వరకు వచ్చే అవకాశం ఉందని రైతు సాంబయ్య వివరించారు. చామంతి పూలసాగుతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను సాధిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చిన రైతు సాంబయ్యను తోటి రైతులు ఆదర్శంగా తీసుకుని తమ భూముల్లోని ఆయా పూలసాగు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

పూలసాగు బాగుంది..

పూలసాగుకు పెట్టుబడి తక్కువగా ఉంది. కలుపు తీసుకోవడం, పైమందులు వాడుకుంటే సరిపోతుంది. చామంతి తోట చాలా సున్నితంగా ఉంటుంది. కుక్కలు, కోతులు, కోళ్లు రాకుండా చూసుకోవాలి. అవి వస్తే కొమ్మలు విరిగిపోతాయి. చామంతి, నందివర్ధనంతోపాటు కాగడా మల్లె తదితర మొక్కలు కూడా నాటాను. కొత్త పంటల సాగుతో ఆదాయంతోపాటు తృప్తి కలుగుతోంది.

–జక్కులూరి సాంబయ్య, రైతు

దాడికి పాల్పడిన వారిపై చర్యలకు డిమాండ్

నందిగామటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు ఆదివారం డిమాండ్ చేశారు. మండలంలోని దాములూరు గ్రామంలో పార్టీ కార్యకర్తలు కందుకూరి శ్రీను, తోకల వంశీ, కందుకూరి సంగమేశ్వరరావులపై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారన్నారు. దాడిచేసి గాయపరిచారని పోలీసులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోకపోవడం తగదన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి దాడికి పాల్పడిన టీడీపీ నాయకులు గాదె పుల్లయ్య, మంద నరేష్, వంగలపూడి దయాకర్, మంద సుధీర్ తదితరులపై కేసు నమోదు చేయడంతోపాటు వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వాహనాల తనిఖీ

వీరులపాడు: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపేవారిపై కఠినచర్యలు తప్పవని వీరులపాడు ఎస్‌ఐ అనిల్ హెచ్చరించారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటోవాలాలు పరిమితి మేరకు ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నిబంధనలు పాటించని పలువురు వాహనదారులను గుర్తించి వారికి జరిమానా విధించారు.

మౌలిక వసతుల కల్పనకు డిమాండ్



జగనన్నకాలనీ వాసుల సమస్యలు వింటున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలోని లే ఆవుట్ ఎల్‌పీ-2లో ఉన్న గృహ సముదాయానికి ప్రభుత్వం వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బలుసుపాడురోడ్డులోని జగనన్న కాలనీలో సరైన మౌలిక సదుపాయాలులేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు పేర్కొనడంతో పార్టీ నాయకులతో కలిసి తన్నీరు నాగేశ్వరరావు ఆదివారం ఆ కాలనీలో పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం తన్నీరు మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కల నెరవేర్చే ఉద్దేశంతో మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో దేశచరిత్రలోనే లేనివిధంగా రాష్ట్రంలోని 33లక్షల మంది పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చారని గుర్తుచేశారు. అందులోభాగంగా పట్టణ సమీపంలోని బలుసుపాడు రోడ్డులో లే ఆవుట్‌లు ఏర్పాటు చేసి పేదవారి సొంతింటి కలను నిజం చేశారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ఎటువంటి చర్యలు తీసుకోకపోతుండటంతో ఆయా కాలనీలవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీటి సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు లేకపోవడంతోపాటు కనీసం వీధిలైట్లు కూడా వెలగక కాలనీవాసులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీకావన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం కాలనీవాసులు గత ఆరునెలలుగా మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ వారు సైతం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కాలనీలోకి రేషన్ బియ్యం వాహనం రాకపోతుండటంతో కాలనీవాసులు జగ్గయ్యపేట పట్టణంలోకి వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు అవస్థలుపడుతున్నారన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో పలువురు లబ్ధిదారులు ఆయా ఇళ్లనిర్మాణాలను పూర్తిచేసుకోలేకపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి జగనన్న కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించాలని తన్నీరు కోరారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకు వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందన్నా జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు . కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజున్నీసా ఫిరోజ్, విజయవాడ కనకదుర్గ ఆలయం డైరెక్టర్ నంబూరి రవి, పార్టీ రాష్ట్ర ఎస్టీసెల్, ఎస్సీ సెల్ నాయకులు బద్దూనాయక్, కన్నమాల శామ్యూల్, సర్పంచ్ సూరిబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు పింగలి నర్సింహారెడ్డి, మన్నె అప్పారావు, నాయకులు గోగుల వెంకయ్య, అమ్మనబోయిన గోపి, గంగోలు వినోద్, స్థానిక నాయకులు సత్యనారాయణ, సత్యబాబు, సురేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.25 వేల విరాళం



అన్నదానానికి ఆలయ ఈవో కిషోర్‌కుమార్‌కు విరాళం అందిస్తున్న దాత సౌజన్య కుటుంబం



అన్నదానానికి 20క్వింటాళ్ల బియ్యం అందించిన దాత సందీప్

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం గ్రామానికే చెందిన గింజుపల్లి కిషోర్ ధర్మపత్ని సౌజన్య రూ.25 వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు మొత్తాన్ని ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్ చేతుల మీదుగా అందించారు. విజయవాడకు చెందిన పోలిశెట్టి సందీప్ అమ్మవారి దీక్షా స్వాముల అన్నదానం నిమిత్తం 20 క్వింటాళ్ల బియ్యాన్ని వితరణగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

శ్రీతిరుపతమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి మండల దీక్షా మాలధారణ చేశారు. మధ్యాహ్న సమయంలో భక్తులు మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

జిల్లా ప్రధానన్యాయమూర్తికి వినతిపత్రం అందజేత



జిల్లా ప్రధానన్యాయమూర్తి అరుణసారికను కలిసి విజ్ఞప్తి చేస్తున్న బార్ అధ్యక్షుడు సుందరరావు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఉన్న పెనుగంచిప్రోలు మండల సివిల్ పరిధిని జగ్గయ్యపేట కోర్టు పరిధిలోని మార్చుచేయాలని జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు కోరారు. ఈ మేరకు బార్ అసోసియేషన్ సభ్యులంతా ఆదివారం జగ్గయ్యపేట పట్టణానికి విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు మాట్లాడుతూ జగ్గయ్యపేటకు సీనియర్ సివిల్ జడ్జి కోర్టును మంజూరు చేయాలని, పెనుగంచిప్రోలు సివిల్ పరిధిని జగ్గయ్యపేట కోర్టు పరిధిలోని తీసుకురావాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అందుకు జిల్లా న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో పేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శోభారాణి, బార్ సెక్రటరీ దోమల సంతోష్, కోశాధికారి మెట్టెల ఆంజనేయులు, న్యాయవాదులు బి.వెంకట్రామయ్య, సత్యశ్రీనివాసరావు, వి.మధు, జి.లక్ష్మీనారాయణ, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బలహీన వర్గాలను ఆదుకోవాలి



వించిపేట(విజయవాడపశ్చిమ): బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవాలని అతిథులు అన్నారు. ఏపీ దళిత జాగృతి సేనా (ఏపీడీజేఎస్) ఆధ్వర్యాన ఆదివారం వించిపేట, సీఎస్‌ఐ చర్చి ప్రాంగణంలో దళిత న్యాయ పోరాట సదస్సు జరిగింది. పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, దళిత క్రైస్తవ నేతలు పాల్గొన్నారు. ముఖ్యఅతిథి పాపులర్ షూ మార్ట్ గ్రూప్ సంస్థ చైర్మన్ చుక్కపల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వం కల్పించిన ఎస్సీ కార్పొరేషన్ నిధులను తక్షణమే వారికి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారుకార్యక్రమంలో దళిత బహుజన పరిరక్షణ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరావు, సోషలిస్ట్ కూటమి జాతీయ అధ్యక్షులు లామ్ జయ్‌బాబు, చర్చి సంఘ కాపరి ఫాదర్ ఇందుపల్లి కరుణానిధి, ప్రజా సంఘాల నాయకులు పేటేటి రాజా, ఏపీడీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కాసాని గణేష్‌బాబు, కంకిపాటి అనిల్ కుమార్, అనకాపల్లి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పాలేరు బ్రిడ్జి మరమ్మతులు చేపట్టాలి

తన్నీరు నాగేశ్వరరావు



గరికపాడు రాష్ట్ర సరిహద్దు వద్ద కోతకు గురైన పాలేటి బ్రిడ్జిని పరిశీలిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు

గరికపాడు(జగ్గయ్యపేట): విజయవాడ- హైదరాబాద్ రోడ్డులోని పాలేటి బ్రిడ్జి మరమ్మతు పనులను అధికారులను త్వరితగతిన పూర్తి చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు కోరారు. గరికపాడు గ్రామ సమీపంలోని సరిహద్దు వద్దనున్న పాలేరు బ్రిడ్జిని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టులో కురిసిన భారీవర్షాలు, వరదల కారణంగా బ్రిడ్జి రోడ్డు పూర్తిగా కోతకు గురైందన్నారు. నెలలు గడుస్తున్నా జాతీయ రహదారుల అధికారులు మరమ్మతులు త్వరితగతిన చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు వన్‌వే కావడంతో విజయవాడ-హైదరాబాద్ మార్గంలో వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. టోల్‌వేస్‌లో రుసుం వసూలు చేయడం తప్ప బ్రిడ్జి పనులు పూర్తి చేయడంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికే మూడుసార్లు జాతీయ రహదారి అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారు తప్ప మరమ్మతులు మాత్రం చేయించడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతుపనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ వట్టెం మనోహర్, ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు కన్నమాల శ్యామ్యూల్, బద్దునాయక్, నాయకులు మన్నే అప్పారావు, వినోద్, గోగుల వెంకయ్య, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తమ గురువులతో కంచికచర్ల జెడ్పీ పాఠశాల 2004-05 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కంచికచర్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–05లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక ఓసీ కళ్యాణ మండపంలో జరిగింది. పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. సుమారు రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వవిద్యార్థులంతా ఆనందోత్సవాలతో గడిపారు. అలనాటి మధురమైన జ్ఞాపకాలను జ్ఞప్తి చేసుకుని ఆనందోత్సాహాలతో చిన్నపిల్లలా ఆడిపాడారు. తమకు పాఠాలు చెప్పిన గురువులైన విశ్రాంత డీవైఈఓ ఎం జార్జిరాజు ఉపాధ్యాయులు కే విజయ, రోహిణి, కపలవాయి ఓంకార్, కే రఘునాథ ప్రసాద్‌తోపాటు మొయిద్దీన్ విజ్ఞాన్ సంస్థల అధినేత గంగిరెడ్డి రంగారావు, గౌతమి స్కూల్ కరస్పాండెంట్ అబ్బూరి రామారావు తదితరులను ఘనంగా సత్కరించారు. సన్మానం అనంతరం ఆనాటి గురువులు మాట్లాడుతూ సమాజంలోని పేదలను ఆదుకోవడాన్ని గురుతర బాధ్యతగా భావించాలని పూర్వ విద్యార్థులకు సూచించారు. సమజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. తమ మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవడం సంతోషంగా ఉందంటూ పూర్వవిద్యార్థులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాదవరపు శ్రీకాంత్, వేమా కృష్ణచైతన్య, గుండా సాయి గణేష్, పోలిశెట్టి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేట అర్బన్: ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో వేంచేసియున్న పాత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో శ్రీవెంకటేశ్వర స్వామి గానామృత బృందం ఆధ్యాత్మికవేత్త సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర స్వామి వారి చిత్ర పటానికి ఏడుమెట్లు ఏర్పాటుచేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. మధుర ఫలాలను సమర్పించి బృందం సభ్యులు గోవిందనామాలతో భజనలు చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో హైదరాబాద్ కోకపేటకు చెందిన ధూళిపాళ్ల అపర్ణ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ఆరుషి, యామిని, ఐశ్వర్య, సురభి, శ్రీనిక, అనన్య, శ్రీకృతి, సహాస్ర, నిత్యశ్రీ పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై జరుగుతున్న నృత్య ప్రదర్శనను భక్తులు ఆసక్తితో వీక్షించారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.